# పయిలం కొడుకో!

## ...ఆలేటి నాగమణి...

ఆ లదొక గల్లీ
పెగం కూలిన గోడలతో
పాడుపడిన ఇళ్ళు.
వెలిసిపోయిన సున్నంతో
పెచ్చులూడిన అరుగులు

చీమ చిటుక్కుమన్నా విన్పించె నిశబ్ద సామ్రాజ్యంలో స్తబ్దత ముసుగులో చిరుగాలి కూడా భయం భయంగా వీస్తోంది.

విరిగిపోయి, బీటలువారి, రంగులు వెలసి అసహ్యంగా వున్నా అన్ని మూసిన తలుపులె

నిర్దాక్షిణ్యంగా నోరు నొక్కి గొంతు పిసికినట్టు ఒక్క ఇంట్లో నుండి కూడా బయటికి రాని శబ్దాలు.

అతుకుల బొంతలా, చిరిగిన పాత చింకిలా అస్తవ్యస్తంగా అడ్డదిడ్డంగా పరచుకున్న ఇళ్ళతో, ఇరుకుగా మురికిగా వుందా గల్లీ.

ఇద్దరు మనుషులు ఎదురెదురుగా నడవడానికి వీలున్నంత సన్నటి ఇరుకు గల్లీలో... కాదు అలాంటివి అక్కడ ఎన్నో గల్లీలు... ఎన్నో ఇళ్ళు... మూసిన తలుపుల వెనక, ఇళ్ళ లోపల ఎందరో ప్రాణం వున్న మనుషులు నిశబ్దంగా... నిస్తేజంగా మసలుతున్న వేళ

హఠాత్తుగా ఒక కుక్క మొరిగింది.

అంతే... ఆ వెనక, ఒకటి తరువాత ఒకటిగా కుక్కలు ఉండి ఉండి మొరగసాగాయి.

తలుపుల కన్నాల వెనక కళ్ళు... కొన్ని జతల కళ్ళు.

ఆత్రుతగా
భయంగా
దిగులుగా కదిలాయి కాని

ఆకు కదలిక కూడా కన్పించలేదు. విన్పించలేదు.

కాసేపు మొరిగి మళ్ళి నిశ్శబ్దంగా వుండిపోయాయి కుక్కలు.

మొరిగినా అదిలించని మనుషుల నిశబ్దతత్వానికి, భయానికి, ముందుగా ఆశ్చర్యపోయి, తరువాత జారిపడ్డట్టుగా, కుక్కలు కూడా నిశబ్దంగా వుండి పోయాయి.

చిన్నపాటి అలికిడి అయినా చెవులు నిక్కపొడుచుకొని పరికించే వాటికి, మూడురోజులుగా ఆ అవకాశం లేకుండా పోయింది.

వీధి కుక్కలకు ఇళ్ళలోని మనుషులు కనపడక మూడు రోజులైంది.

ఎంత ఆశ్చర్యం!!!

ఈ మనుషులంతా. ఏరి? ఎక్కడికెళ్ళారు ఎప్పుడూ హడావిడిగా, కాలంతో పందెం వేసుకుని పరుగుపెట్టే మర యంత్రాల్లాంటి మనుషులేరి? ఏమో! ప్చ్... అంటూ వీధిలో నిశబ్దంగా తిరుగుతూ ఒక్కొసారి ఏ అరుగు మీదో ముడుచుకొని పడుకోసాగాయి.

నాలుగు వైపుల వేచిన మట్టి గోడల మీద రాటలు పరిచి, పెంకులు అమర్చిన ఆ చిన్న గది — ఆ గల్లీ చివరలో వుంది. అక్కడ ఆ గది ప్రక్కనే గల్లీ మలుపు తిరుగుతుంది.

గల్లీలో నడిచే మనిషి, గల్లీ మలుపు తిరిగితె కాని మలుపులో నుండి వస్తోన్న మరో మనిషికి కన్పించడు. ఆ గది కెదురుగా, గల్లీ. మలుపులో ఓ చెత్తకుండి... ఆ ప్రక్కనె గవర్నమెంటువారి వీధి లైటు స్తంభం... ఆ స్తంభం క్రింద, ఆ చెత్త కుండిని మూడురోజులుగా నానా భీభత్సం చేస్తూ, తినడానికి ఏమైనా దొరుకుతుందే మోనని వెతుకుతోంది గజ్జికుక్క. ఆ వెతకడంలో దాని కడుపు నిండుతుందో లేదోకాని అలసట, వల్లమాలిన నీరసం, కోపంతో ఆ చెత్తకుండిలోని చెత్తనంతా ఆ మలుపులోని దారి అంతా నింపేసి పరిచేసింది.

ప్రతి రోజూ మునిసిపాలిటి వారు చెత్త తీసుకు పోతూంటెనే, ఓ రకమైన దుర్గంధం వచ్చే ఆ చోట — మూడు రోజులుగా, తీసుకుపోక పోయేసరికి, అక్కడి గాలినంతా కలుషితం చేస్తోంది అక్కడి వాసన.

ఆ గల్లీలోని వారికంటే ఎక్కువ బాధ పడుతున్నాడు...

ఆ గదిలో వుండే
ఒంటరి ప్రాణి
ఆత్మ.

ఆ గదికుండే చిన్నకిటికి కూడా మూసుకుని ఒక్కడే.... ఆలోచనలు తినేస్తుంటే.

ఆకలి అతడి పేగులను నమిలేస్తుంటే

భయం అతడి ధైర్యాన్ని క్రుంగదీస్తూ ఒంటరి తనాన్ని సవాలు చేస్తుంటే—

తలుపులు తీయలేక— బయటికి రాలేక, ఆకలితో అలమటించి పోతున్నడతను.

పలకరించే దిక్కులేక, పరితపించి పోతున్నాడు.

కాలం తెలీకుండా గడచిపోతుంది. రాత్రి పగలు తేడా లేకుండా రోజులు, గంటలు కదలిపోతున్నాయి.

అమ్మా! అంటూ, పొట్టను రెండు చేతులతో నొక్కుకుంటూ, చాప మీద ఇటునుండి అటూ, అటు నుండి ఇటూ దొర్లసాగాడు.

కుండనిండా వున్న నీళ్ళు అడుగంటిపోయాయి. నీళ్ళు తాగి కడుపునింపు కుందామంటే నీళ్ళు లేవు. నీళ్ళున్నా— ఆకలి తృప్తి పడేలా లేదు పేగులు సహకరించెలా లేవు.

ఆత్మ— పూర్తిపేరు ఆత్మానందం.

జీవితంలో ఆత్మానందం పొందలేక, కొడుకు పేరు పిలుస్తూ అయినా, ఆ సంతృప్తిని పొందాలనుకున్న తండ్రి తన కోరిక పూర్తిగా తీర్చుకోకుండానే ఆత్మానందానికి ఐదేళ్ళు రాకముందే వెళ్ళిపోయాడు.

ఆత్మానందం జీవితంలో తల్లి ముఖ్యపాత్ర వహించింది. తన జీవితంలోని ఆనందాన్నంతా కొడుకుకు ఇవ్వడంలోనే ఆమె జీవితం గడిచిపోయింది.

అకాల వృద్ధాప్యం ముసురుకున్న ఆ తల్లి ఆశలన్నీ కొడుకు ప్రయోజకుడవ్వాలనే.

పట్టాచేతపుచ్చుకొని పట్నం బండి ఎక్కాడు ఆత్మ.

పయిలం... పయిలం కొడుకా! అంటూ బండి వరకు వచ్చి సాగనంపిందా తల్లి.

భద్రం కొడుకా! అంటూ పట్నంలో మసలుకునే జాగ్రత్తలు చెప్పి పంపింది.

పల్లెటూళ్ళోని పంతులువేత ఉత్తరం రాయిస్తూ ఎప్పటికప్పుడు కొడుకు క్షేమం తెలుసుకుంటూనే వుందా తల్లి. రెండ్రోజులకో వుత్తరం ఆత్మ రాస్తూనే వున్నాడు. కుదురుకున్నది చిన్న ఉద్యోగం...

ప్రతిరోజు అర్ధాకలితో వేచిపోయే ఆత్మ నెలతిరిగే సరికి పాతిక రూపాయలన్నా తల్లికి పంపించేవాడు.

ఆ గల్లీలోని ఆ చిన్న ఇల్లు పాతిక రూపాయలకు అతికష్టంమీద కుదుర్చుకున్నాడు. చెత్తకుండి ముందు ఆ గదిలో నిర్వికారంగా వుండే అతను జీవితంతో రాజీపడలేదు— జీవితమే అతనితో రాజీ పడిపోయింది. ఆత్మలోని ఆత్మవిశ్వాసం చాలా గొప్పదనే చెప్పాలి.

కాని—

ఈ మూడు రోజులుగా...
వీధిలో సన్నటి అలికిడి...
ఎవరో నడుస్తున్న చప్పుడు...
కుక్క కాదు... మనిషి నడకే.

మరో పది నిమిషాలు గడిచే సరికి ఆ గల్లీలో కలకలం... అడుగుల చప్పుడు... హడావిడి.

ఆత్మానందం లేచికూర్చున్నాడు.

"ఏ భాయ్! బాహర్ ఆవో... కర్ఫ్యూ ఏక్ ఘంటె కెలియే కుల్ గయా!" ఎవరో అరిచాడు గట్టిగా.

స్ప్రింగ్‌లా లేచి నిలబడ్డాడు ఆత్మ.

మెల్లిగా కిటికి తెరచాడు.

మనుషులు నడుస్తున్నారు...

రెండు నిమిషాల్లో గదికి తాళంవేసి వెనుతిరిగాడు.

"కర్ఫ్యూ"

పాతనగరంలో నర్తిత సృష్టిస్తున్న కర్ఫ్యూ...

పూట పూటకు పొట్టకోసం పిడికెడు మెతుకులు వెతుక్కునే వారికి శిక్షలా... శాపంలా మారిన కర్ఫ్యూ.

"ఏయ్... ఆత్మాభాయ్... మాది సల్మా

దగ్గిరలోనే వున్న మసీదు నానుకొని ఖబర్‌స్థాన్ చేరుకొన్నారు. చింతచెట్ల నీడల్లో నిలిచిన సమాధుల మధ్య నిశ్శబ్దసంగీతం... గాలి విసురుగా వీస్తోంది. పిల్లనలా క్రింద పడుకోబెట్టి ఇద్దరు కలిసి గొయ్యి తవ్వేసారు.

చచ్చిపోయింది... పాలకోసం ఏడిచి ఏడిచి చచ్చిపోయింది." పాలులేక గొంతుక ఎండిపోయి చచ్చిపోయింది. గల్లీ చివరింటి యూసఫ్ గోలుగోలున ఏడుస్తున్నాడు.

"ఒక్క గంటలో ఈ పిల్లను... మట్టిలో కప్పిరావాలి భాయ్... జరా సాయం రావూ?"

నిమిషం ఆలోచించిన ఆత్మ మనసు ఏమూలో కొట్టుకుంది.

"పద... చలో..." అన్నాడు.

తల్లి వొళ్ళో ప్రశాంతగా నిద్రపోతున్నట్టున్న ఆ నెలల, పసిగుడ్డును, బలవంతంగా లాక్కొని తెల్లటి గుడ్డలో చుట్టి బయలుదేరాడు యూసఫ్.



"అల్లా... మేరి బచ్చీ..." అంటూ గుండెలు బాదుకుంటూ, అంత్రక్రితం వరకూ, శవాన్ని వొళ్ళో వుంచుకొని నిబ్బరంగా వుండగలిగిన ఆ తల్లి గుండెలు పగిలిపోయేలా ఏడుస్తోంది.

"చలో... ఆత్మభాయ్..." మనం వెనక్కి వచ్చెయ్యాలి... జల్దీ" పోయిన ప్రాణం పోగా తన ప్రాణం మీద తీపి... కర్ఫ్యూ మహిమ— పరుగులాంటి నడక... కాదు... పరుగే.

దగ్గరలోనే వున్న మసీదు వెనుకొని ఖబరస్తాన్ చేరుకున్నారు.

చింతచెట్లు, నీడల్లో నిలిచిన సమాధుల మధ్య నిశబ్ద సంగీతం... గాలి విసురుగా వీస్తోంది.

పిల్లనలా క్రింద పడుకోబెట్టి ఇద్దరు కలిసి గబగబా గొయ్యి తవ్వేసారు.

మట్టిచేతులు దులుపుకుంటూ, తలఎత్తిన ఆత్మ రెండు చేతులతో పాప సమాధి మీదపడి ఏడుస్తున్న యూసఫ్‌ను లేవనెత్తాడు.

"పద యూసఫ్ భయ్యా... కర్ఫ్యూ టైమ్ అయిపోవస్తుంది" అన్నాడు.

"అవును. పిల్లలకు... ఇంకా బతికున్న పిల్లలకు తిండి గింజలు కొనాలి" అంటూ బయలుదేరారు.

ఎంత చిత్రం. చావును మరిపించె ఆకలి... మమతను మరిపించే భయం... జారిన ప్రాణం గురించికాక జారబోయే ప్రాణాలు జారకుండా మనిషి పడె తపన... మాయకమ్మిన మనిషి జీవితం... అది పాతనగరంలోని మనుషులలో మమత— ప్రేమ... అన్ని కరువైనాయా?

అడుగులలో వేగం... ఆత్రుత... వాటిని మించిన ఉద్వేగం... వెళ్ళిపోవాలి... ఇంట్లోకి వెళ్ళిపోవాలి.

తెరిచిన దుకాణాలు తెరిచినట్టే మూసేస్తున్నారు.

ధరలు విపరీతంగా పెంచేసారు.

అవకాశం... అవసరం... మనిషిని మనిషి దోచుకోవ నికదే— అవకాశం...

దేవుడికే కాదు... రాక్షసి లాంటి కర్ఫ్యూ కు కూడా ిదవాళ్ళంటే అలుసే... అడుక్కుతినే వాళ్ళనుసైతం ఆకలికి ఆహుతి చేస్తూ కసి తీర్చుకుంటున్న కర్ఫ్యూ.

కర్ఫ్యూ మళ్ళీ సడలిస్తారో లేదో... అనుకోకుండా హఠాత్తుగా విధించిన కర్ఫ్యూ. రెండు రోజులుగా సడలించలేదు... మూడో రోజు... ఒక్కగంట సేపు... తిరిగి... మళ్ళీ... కర్ఫ్యూ... ఇలా ఎన్నాళ్ళూ?

"దేవుడా రక్షించు ఈ పాతనగరాన్ని!?"

రోడ్డు మీది జనం...లో పరుగు... ఆలజడి... ఆత్రుత— గావుకేకలు... మధ్య ఎవరో—

ఎవరినో పొడిచేసారు...

ఎవరిని...

ఎవరినో... పరికించే తీరిక... ఆలోచించే వ్యవధి ఎవరికుంది.

పోలీస్ వ్యాన్‌లు విజిల్ వేస్తూ వచ్చేస్తున్నాయ్.

మరో ఐదు నిమిషాల్లో అందరూ వెళ్ళిపోవాలి... చలో... వ్యాన్‌లో నుండి అనౌన్సుమెంటూ.

ఐదురూపాయలు చేతిలో వున్న ఆత్మకు ఏం కొనుక్కోవాలో ఆ అయిదు రూపాయలకు ఏం కొనుక్కోగలడో అర్థం కాలేదు... కాని కొనుక్కోవాలి తప్పదు... ఆకలి తనను బ్రతుకనివ్వదు...

బ్రెడ్ ఒకటి కొనుక్కొని బయలు దేరాడు.

ఆత్మా! సన్నటి మూలుగు. వెనక్కి తిరిగాడు.

యూసఫ్ భాయ్... ఆత్మగావు కేక వేస్తూ పరిగెత్తాడు...

పోలీస్ విజిల్సు... బూట్ల టకటకలు... ఎక్కడో పిస్తోలు పేలిన శబ్దం గింగిరాలు తిరుగుతూ కుప్పకూలి పోయాడు.

యూసఫ్ రెండు చేతులతో తలపట్టుకుంటూ.

యూసఫ్ భయ్యా! రెండు చేతులతో లేవనెత్తాడు....

పరుగులాంటి నడక...

ఆయాసం... మంచి కండపుష్టి కల యూసఫ్‌ను మొయ్యడం ఆత్మకు చేతకావడంలేదు. యూసఫ్ తల మీద బలంగా లాఠీ దెబ్బ.

క్షణక్షణానికి రోడ్డు నిర్మానుష్యంగా మారిపోతోంది.

ఒకటే పరుగులు... ఒకరిని ఒకరు పట్టించుకునే ఓపికా తీరికా లేకుండా... ఒకటే ఉరుకులు పరుగులు..

ఏం జరిగింది?

ఏం జరగబోతోంది? తెలీడంలేదూ?

"ఆత్మా!...!! యూసఫ్ కళ్ళలో నీళ్ళు...

"నన్ను విడిచిపారిపో... వెళ్ళిపోభయ్యా... లేకుంటే... నిన్ను కూడా... చంపేస్తారు."

"అయిపోయింది భయ్యా! వచ్చేసాం.... ఆత్మ మాటలకు... భయ్యా! ఎవరన్నారయ్యా ఇది హిందూముస్లిమ్ గొడవ అని... కాదు... ఇది..."

"యూసఫ్ భయ్యా! భయంలేదు. వచ్చేసాం... అదిగో..!" అంటూ వాళ్ళింటి తలుపు తట్టేలోగానే వాళ్ళ వాళ్ళు వచ్చి ఏడుస్తూ లోపలికి తీసికెళ్ళి పోయారు. యూసఫ్ కళ్ళల్లో కృతజ్ఞత...

ఆత్మ లేచి నిలబడ్డాడు.

బయటికి వచ్చేసాడు.

అతని చేతిలో పదిలంగా పట్టుకున్న బ్రెడ్ ఎర్రగా రక్తపు ముద్దలా...

ఆత్మ కళ్ళనిండా ఎర్రటి రక్తపు జీరలు.... ఆకలి పేవులు గుర్రుమన్నాయి.

టైమ్ అయిపోయింది...

మూడు రోజులుగా కడుపులోకి పిడికెడు మెతుకులు పోలేదు. తాగిన నీళ్ళు వొంట్లో ఏ మాత్రం సత్తువ మిగల్చలేదు.

ఇప్పుడిక ఏం చేయలేడు.

వెనకనుండి అడుగుల చప్పుడు.

ఆత్మ గబగబా గదివైపు వెళ్ళాడు. ఆకలి మింగబోయే ప్రాణాన్ని రక్షించు కోవాలనే తపన...

తలుపులుమూస్తూ తలుపుకు జారగిలబడిపోయాడు...

నాలుక తడుపుకోవడానికి కూడా గుక్కెడు నీళ్ళు లేని కుండ వెక్కిరిస్తున్నట్టు ఓ ప్రక్కకు వొరికి పోయివుంది.

నీలవంగా నవ్వుకున్నాడు.

పక్కింట్లో నుండి సన్నగా వార్తలు

కళ్ళు మూసుకొని విన్నాడు.

పాత నగరంలో ఈ సాయంత్రం...

ఓ గంటపాటు కర్ఫ్యూను సడలించారు. ఆ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదు.

తిరిగి ఈ సాయంత్రం ఆరుగంటల నుండి రేపు సాయంత్రం ఆరుగంటల వరకు కర్ఫ్యూ విధించారు.

ఆత్మప్రాణం గిలగిల లాడిపోసాగింది.

ఇరవై నాలుగు గంటలు— ఆకలి తనను బ్రతనిస్తుందా.

అమ్మా! అమ్మా... వెర్రిగా అక్రోశించింది ఆత్మ.

ఆకలి ఆత్మ ప్రాణాన్ని విలవిల లాడిస్తోంది.

సయిలం కొడకా! తల్లిమాటలు గుర్తుకు వచ్చాయి.

"పట్నం బతుకు... ఏం సయిలం... కష్టం చేసుకొని బతుకు దామన్నా... నీలులేని బతుకు... ఒకరినొకరు చూసుకోకుండా పొదుచుకు వచ్చే బతుకులు.

మనిషిని మనిషిగా మిగలనీయని కోపం... ద్వేషం... పగ... నిండి పోతే ఈ బతుకుల్లో ఏం సయిలం? మనిషిని మనిషి నిలువునా దోచుకునే నగరంలో ఏం సయిలం? తెల్లారి లేచిన దగ్గరి నుండీ పొట్ట కోసం పాకులాడుతూ పరుగులు తీస్తూ ఎటునుండి ఎటు పోతున్నామో తెలియని పరిస్థితిలో ఏం సయిలం.."

"కర్ఫ్యూ ప్రాంతంలోని వారికి టెలిగ్రామ్ వార్తలు" రేడియోలో నుండి.... చాలా స్పష్టంగా వినిపిస్తున్న చప్పుడు...

కోనేరుపల్లి నుండి ఫలానా వీధిలోని ఫలానా ఇంటి నెంబరులోని ఆత్మానందానికి శంకరం మాష్టారు పంపిన టెలిగ్రామ్ "మదర్ సీరియస్... స్టార్ట్ ఇమిడియట్లీ"

మగతగా మూతలు పడుతున్న ఆత్మ చెవులకు లీలగా సోకిన వార్త...

అమ్మా!... ఎక్కడికి రామా? అందని తీరానికి వెళ్ళి పోతున్న నేను... ఎక్కడికని రామా!

"చెప్పు... కదలనీయని కర్ఫ్యూ నన్ను... నీ..."

ఆత్మనందం మనసు మూగపోయింది. శరీరం చల్లగా మంచు ముద్దలా... ఆకలి మింగిన ఐసు ముద్దలా... అయిపోయింది.

వెళ్ళి పోతున్న ఆత్మ, ఆత్మను ఏ కర్ఫ్యూ ఆపలేక పోయింది. అక్కడ మారుమూల ఊళ్ళో.. కుక్కిమంచంలో పడుకున్న కొన ఊపిరి—

"ఆత్మరాలేదూ..." అన్న ప్రశ్నకు జవాబుగా—

కడుపులో ఏమూలో కన్నపేవు కలుక్కుమంది. *



సంతోషం

"నేను చైనాలో పుట్టనందుకు చాలా సంతోషిస్తూ వుంటాను" సీరియస్‌గా అన్నాడు రేవంత్.

"ఏం?" ప్రశ్నించాడు రవి.

"నాకు చైనీస్ భాష రాదుగా అందకు" బదులిచ్చాడు రేవంత్.

—జోకర్ (హైద్రాబాద్)

